

కాంగ్రెస్ సమావేశం రసాభాస

- గొడవకు దారితీసిన 'పురుమల్ల' వ్యాఖ్యలు
- వేదికపైనే నేతల తోపులాట
- ఏఐసీసీ కార్యదర్శి సహనానికి పరీక్ష



1. పురుమల్ల శ్రీనివాస్ ప్రసంగానికి అడ్డు తగులుతున్న నాయకులు
2. పురుమల్ల శ్రీనివాస్‌ను వేదిక కిందికి లాగేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ జిల్లా సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ విశ్వనాథన్ పెరుమాళ్, జిల్లా పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, పి రఘునాథ్‌రెడ్డి సమక్షంలోనే పురుమల్ల శ్రీనివాస్ తాము నామినేటెడ్ పదవుల విషయంలో ఏ ప్రతిపాదనలు టీపీసీసీకి పంపించినా ఒక దుర్మార్గుడు అడ్డుకుంటున్నాడని అన్నారు. ఇప్పటికీ నాలుగైదు ప్రతిపాదనలకు అదేగతి పట్టిందని ఆయన చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఒకరినొకరు తోసేసుకునే స్థాయికి వెళ్లి ఏఐసీసీ కార్యదర్శి సహనానికి పరీక్ష పెట్టాయి.

ఒకరినొకరు నెట్టుకున్న నేతలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శితోపాటు జిల్లా పరిశీలకులు హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పార్టీకి కార్యకర్తలే దేవుళ్లని, అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంతో వారిలో అసంతృప్తి పెరిగిపోతున్నదని అన్నారు. తాను కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ పదవికి వైద్యుల అంజన్‌కుమార్ పేరును ప్రతిపాదిస్తూ మరికొందరిని సభ్యులుగా సూచిస్తూ టీపీసీసీకి పంపించిన ఒక దుర్మార్గుడు హైదరాబాద్‌లో అడ్డుకున్నాడని, ఇలాగే నాలుగైదు ప్రతిపాదనలకు కూడా ఆపేశారని ఆరోపించారు. గతంలో కూడా పురుమల్ల శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశిస్తూ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ప్రస్తుతం కూడా ఆయన మంత్రిని టార్గెట్ చేస్తూ మాట్లాడారని భావించిన ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బోనాల శ్రీనివాస్ తదితరులు పురుమల్లను అడ్డుకుంటూ ఆ దుర్మార్గుడెవరో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒక దశలో వేదికపైనే ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర గందరగోళ పరిస్థితిని సృష్టించడంతో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి వారందరిని స్టేజీ కిందకు నెట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరగంటసేపు సమావేశాన్ని నిలిపివేసి ఆ తర్వాత కొనసాగించాల్సి వచ్చింది. పురుమల్ల శ్రీనివాస్ తన ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డుకుంటున్నాడని గతంలో కూడా మాట్లాడిన నేపథ్యంలోనే మంత్రి వర్గీయులు పురుమల్ల మాట్లాడుతుండగా అడ్డు తగిలారు.

పోటాపోటీగా నినాదాలు

సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్ జిందాబాద్ అని ఆయన వర్గీయులు, పురుమల్ల జిందాబాద్ అంటూ ఈయన వర్గీ యులు నినాదాలు చేసుకుంటూ వెళ్లడం కూడా ఈ సందర్భంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదమెలా ఉన్నా కాంగ్రెస్ పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని, నామినేటెడ్ పదవులు భర్తీ చేయకపోవడంపై అసహనానికి గురవుతున్నారని వెల్లడైంది. కరీంనగర్ నియోజక వర్గంలో పార్టీ నాయకులను, శ్రేణులను సమన్వయ పరిచేవారు లేరనే అభిప్రాయం వ్యక్తమయింది.

పార్టీ తీరుపై అసంతృప్తి

ఆ తర్వాత మాట్లాడిన వారంతా అధికారంలో లేనప్పుడు పార్టీ కోసం పని చేస్తూ వచ్చి పార్టీని ప్రజల్లో బతికిస్తూ వచ్చినవారికి అవకాశాలు ఇవ్వడం లేదని, పార్టీ అధికారంలోకి రాగానే ఇతర పార్టీల నుంచి వచ్చిన పారాచూట్ నేతలు లాబీలు చేసి పదవులు పొందుతున్నారని ఆక్షేపించారు. వక్తలందరూ పార్టీ వ్యవహరిస్తున్న తీరును దుయ్యబడుతూనే పురుమల్ల శ్రీనివాస్ లైన్‌లోనే మాట్లాడారు. పురుమల్ల మాత్రం గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా బాహాటంగానే మాట్లాడి ప్రత్యేక సమావేశాన్ని డీసీసీ కార్యాలయంలోనే నిర్వహించారు. ఆ సందర్భంలోనే ఆయన మాట్లాడిన మాటలు పార్టీలో కలకలం రేకెత్తించాయి. కొందరు కాంగ్రెస్ నాయకులు దీనిపై పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేయగా, క్రమశిక్షణ కమిటీ ఆయను షోకాజ్ నోటీస్ జారీ చేసింది. దానికి పురుమల్ల జవాబు కూడా ఇచ్చారు. ఆ వివాదానికి అప్పుడు తెరపడింది. మళ్లీ ఇప్పుడు ఆయన దుర్మార్గుడు అని చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా మంత్రినుద్దేశించే అనే భావనకు వచ్చిన కొందరు సంస్థాగత నిర్మాణ సమావేశాన్ని రసాభాసాగా మార్చారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పార్టీ లైన్ తప్పిన వారిని ఉపేక్షించేది లేదు, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించే పరిస్థితి ఏర్పడింది.

భూభారతి చట్టం రైతులకు మేలు

- కలెక్టర్ పమేలా సత్పతి



చల్లూరు రైతు వేదికలో భూ భారతి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

వీణవంక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన భూభారతి ఆర్వోఆర్ చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం వీణవంక మండలం చల్లూరు రైతు వేదికలో భూభారతి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన చట్టంలో క్షేత్ర స్థాయిలో సర్వే చేసి విచారణ జరిపిన తర్వాతే రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ధరణిలో పరిష్కారం కాని సాదాబైనామా దరఖాస్తులు నూతన చట్టంతో పరిష్కారమవుతాయన్నారు. రైతుల భూ సమస్యలకు తహసీల్దార్ వద్ద న్యాయం జరుగకుంటే ఆర్డీవో వద్దకు, అక్కడ సంతృప్తి చెందకుంటే భూమి ట్రిబ్యునల్ వద్దకు వెళ్లి అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ధరణిలో ఉన్న అనేక మ్యాడ్యుల్స్‌తో రైతులు ఇబ్బంది పడ్డారని, నూతన చట్టం ప్రకారం భూమి సవరణ కోసం దరఖాస్తు చేసుకుంటే 60 రోజుల్లో సమస్య పరిష్కారిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, ఏడీఏ సునీత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్,సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గాజుల మేరి శ్యాంసన్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలి

మానకొండూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మానకొండూర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లసర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరుగుకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి ఉన్నారు.

చివరి దశలో కరీంనగర్ రైల్వే స్టేషన్ పనులు

- 15 రోజుల్లో ప్రారంభం
- దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి



రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్ రెడ్డి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వే స్టేషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో జరుగున్న అభివృద్ధి పనులను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరికొత్త హంగులతో కరీంనగర్ రైల్వే స్టేషన్ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోందని తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 26.64 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం పనులు చేపట్టామన్నారు. రైల్వే స్టేషన్ బయట, లోపల ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రెండు వారాల్లో పనులను పూర్తి చేస్తామన్నారు. మూడు ప్లాట్ ఫాంలు, రెండు లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్స్, మోడ్రన్ టాయిలెట్లు, డిజిటల్ డిస్‌ప్లేలు, సీసీ కెమెరాలు అందుబాటులోకి తెస్తామన్నారు. 15 రోజుల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఆయన వెంట దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారి సుబ్రహ్మణ్యం, స్టేషన్ మేనేజర్ ఉన్నారు.

లక్ష్మణరేఖ దాటితే చర్యలు తప్పవు..

- అందరూ ఐకమత్యంగా పనిచేయాలి
- ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్



కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్దేశించిన క్రమశిక్షణ లక్ష్మణరేఖ దాటితే చర్యలు తప్పవని ఏఐ సీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ కాంగ్రెస్ శ్రేణులను హెచ్చరించారు. కాంగ్రెస్ జిల్లా సంస్థాగత నిర్మాణం సన్నాహక సమావేశం సోమవారం డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాథన్ పెరుమాళ్ మాట్లాడుతూ పార్టీ క్రమ శిక్షణ విధానాన్ని కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరూ పాటించాలన్నారు. పార్టీలో కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉండాలని, బేదాభిప్రాయాలు విడనాడాలన్నారు. పార్టీని కింది స్థాయి నుంచి నిర్మాణం చేసేందుకు సమావేశాలు, అభిప్రాయాల సేకరణ తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో రాజ్యాంగ పరిరరక్షణ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు.

కష్టపడ్డవారికి గుర్తింపు ఉంటుంది

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని, ఎవరు కూడా నిరాశపడవద్దని అన్నారు. బేదాభిప్రాయాలుంటే పార్టీ లోపల పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కార్యకర్తలు రక్తన్ని చెమటగా మలిచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం మాట్లాడుతూ కార్యకర్తలే నాయకులకు మార్గదర్శకులన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ వేదికపై గొడవపడకుండా పార్టీ పటిష్టానికి పాటుపడాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ బరువు బాధ్యతలు మోసిన కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారని, వారికి ఏదో ఒక పదవి ఇస్తే బాగా పని చేస్తారన్నారు. 2017కు ముందు నుంచి పార్టీలో ఉన్న వారిని గుర్తించాలని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని వెలిచాల రాజేందర్‌రావు కోరారు. పదేళ్ల పార్టీ జెండా మోసి, ధర్నాలు, ఆందోళనలు చేస్తే తగిన గుర్తింపే లేదని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటుపోట్లను తట్టుకుని నిలబడినవారికి భవిష్యత్ ఉంటుందని కిసాన్ సెల్ అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పార్టీలో అంతర్గత విబేధాలను పరిష్కరిస్తే పార్టీకి తిరుగుండదని అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి అన్నారు. తమ విద్యాసంస్థల్లో కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యుల పిల్లలకు రాయితీ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, కొరివి అరుణ్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, నాయకులు రుద్ర సంతోష్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, కాంరెడ్డి రాంరెడ్డి, ముత్యం శంకర్, సిరాజ్ హుస్సేన్, చేర్ల పద్మ, బోనాల శ్రీనివాస్, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్య, పంజాల స్వామి గౌడ్, ఆకుల ప్రకాశ్, ఎలగందుల మల్లేశం, రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టానికి చర్యలు

పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ సోషల్ మీడియా విభాగంతోపాటు గ్రామ స్థాయి నుంచి పటిష్ట పరిచేందుకే సంస్థాగత నిర్మాణం కార్యక్రమాన్ని చేపట్టి నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురితో కమిటీ వేస్తామని, మండలం కమిటీకి ఐదుగురు, బ్లాక్‌స్థాయి కమిటీకి ముగ్గురు, డీసీసీకి ఐదుగురి పేర్లను ప్రతిపాదించి. రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పంపిస్తామన్నారు. మే 20లోగా ఈ సమావేశాలు పూర్తి కావాల న్నారు. కార్యకర్తలు గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కమిటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని, తమ బయోడాటా జతపరిచి అందజేయాలన్నారు. కమిటీలకు ప్రతిపాదించిన పేర్లను కార్యకర్తల సమక్షంలోనే చదివి వినిపిస్తామన్నారు.

ప్రయాణికుల రక్షణకు పోలీస్ అవుట్ పోస్ట్

భగత్‌నగర్/కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రక్షణకు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నామని సీపీ గౌస్‌ఆలం అన్నారు. కరీంనగర్‌లోని బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్టును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు. మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. పోలీస్ అవుట్ పోస్టులో 24 గంటల పాటు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్ఐ రాజన్న, ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఏటీఎం జి సురేష్, కార్గో మేనేజర్ రామారావు పాల్గొన్నారు.



బస్టాండ్ అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న సీపీ గౌస్ ఆలం

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫ రెన్స్ హాల్‌లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లతో సోమవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలో 57,763 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్త యిందని వెల్లడించారు. ప్రత్యేక అధికారులు దరఖాస్తుల విచారణ వేగవంతం చేయలన్నారు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కోటాలో నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు ఇదివరకే పంపించామని తెలిపారు. బ్యాంకుల నుంచి ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంక టేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి పవన్‌కుమార్, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

వెలవెలబోయిన జిల్లా రవాణా కార్యాలయం

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వాహనాదారులతో నిత్యం రద్దీగా ఉండే జిల్లా రవాణా శాఖ కార్యాలయం సోమవారం బోసిపోయి కనిపించింది. ప్రతి సోమవారం వివిధ పనుల కోసం వచ్చే వారితో కార్యాలయం కిటకిటలాడేది. ఎండలు ముదరడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. మామూలు రోజుల్లో పనులు కావాలంటే గంటల తరబడి నిలుచోవాల్సి వచ్చేది. సోమవారం కార్యాలయానికి వచ్చిన వారికి నిమిషాల్లోనే పనులు పూర్తయ్యాయి. ప్రతీ రోజు 500కి పైగా దరఖాస్తులు వచ్చేవి. సోమవారం 270 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.



జనాలు లేక ఖాళీగా ఉన్న రవాణాశాఖ కార్యాలయం



ఎల్ఎండీలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


నరసమ్మ(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికిచెందిన కెడిక నరసమ్మ (60) తన భర్తతో కలిసి ఉంటోంది. వారి కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే నరసమ్మ భర్త తిరుపతి రెడ్డికి ఇటీవలే హార్ట్‌స్ట్రోక్ వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో నరసమ్మ తన భర్తకు సేవచేస్తూ ఆమె కూడా అనారోగ్యానికి గురైంది. కుమారులు కూడా అందుబాటులో లేకపోవడంతో తమని చూసుకొనే వారులేరని మనస్తాపం చెందింది. ఆదివారం ఈనెల27న కరీంనగర్ వెళ్లి వస్తానని భర్తకు చెప్పి సాయంత్రం ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఇంటికి వెళ్లకుండా నరసమ్మ ఎల్ఎండీలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం మానేరుడ్యాంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికితీసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహం ఎవరిదనే సమాచారం లేకపోవడంతో సోషల్‌మీడియాలో మృతురాలికి సంబంధించిన వివరాలు పెట్టడంతో వైరల్ అయ్యాయి. దీంతో సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న మృతురాలి కుటుంబసభ్యులు కెడికనరసమ్మగా గుర్తించి ఎల్ఎండీ పోలీసులను సంప్రదించారు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి బలవన్మరణం


జంగ మల్లయ్య(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముండే జంగ మల్లయ్య(80) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతుళ్లు, కొడుకు వద్దకు వెళ్లకుండా ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరితనంతో మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి కూతురు ప్రమీల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనగర్‌కు చెందిన తిప్పర్తి హరికృష్ణ(35) దుర్మరణం చెందాడు. తిప్పర్తి పరిపూర్ణాచారి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. కోతిరాంపూర్ మూలమలుపు వద్ద కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా హరికృష్ణ మృతిచెందగా, పరిపూర్ణాచారి చికిత్స పొందుతున్నాడు. హరికృష్ణ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● వరి కోత యంత్రాలతో జాగ్రత్త

● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు

వెల్గటూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు వరి పంట కోయడానికి కోత యంత్రాలు (హార్వెస్టర్)పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా హార్వెస్టర్లు నడిపే పలువురు ఆపరేటర్ల అజాగ్రత్త ప్రతీ ఏటా ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు అంగవైకల్యంతో జీవితాంతం బాధపడుతున్నారు. ఆపరేటర్ల కొరత వలన ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా పని చేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక, రవాణా శాఖ అధికారులు హార్వెస్టర్ల యజమానులు, ఆపరేటర్లకు నిబంధనలు, రక్షణ చర్యలపై సీజన్ ఆరంభం ముందే అవగాహన కల్పిస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.

ఆపరేటర్లు పాటించాల్సిన జాగ్రత్తలు

- హార్వెస్టర్ విడి భాగాలు సరిగా పనిచేస్తున్నదీ.. లేనిదీ పొలంలోకి దిగక ముందే సరిచూసుకోవాలి.
- పని లేనపుడు వాలు ప్రదేశాల్లో నిలిపి ఉంచడం, టైర్ల కింద రాళ్లు అడ్డుపెట్టడం ప్రమాదకరం.
- యంత్రం మరమ్మతుకు గురైతే నిపుణులతోనే తనిఖీ చేయించాలి.
- కన్వేయర్ బెల్టు వంటి భాగాలు మరమ్మతు చేయాల్సి వస్తే అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలి.
- వర్షం, పొగమంచు సమయాల్లో పొలంలో నీళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు కోత పనులు చేయవద్దు.
- ఇంజన్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఏ పని చేయొద్దు.
- బురద ఉన్నపుడు కోత పనులు చేస్తే యంత్రాలు అందులో కూరుకునే ప్రమాదముంది.

రైతులు, కూలీలు పాటించాల్సినవి..

- హార్వెస్టర్ వెనుక భాగం ఆపరేటర్‌కు కనిపించదు. కోత కోసే సమయంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు యంత్రాల వద్దకు వెళ్లవద్దు.
- హార్వెస్టర్ కదులుతున్నపుడు ఎక్కడం, దిగడం చేయవద్దు.
- రహదారులు, పొలాల్లో అడ్డు వచ్చే కరెంటు తీగలను ఎండిన కర్ర, లేదా రబ్బరు, ప్లాస్టిక్ సాధనాలతో పక్కకు తొలగించాలి.
- యాసంగి కోతల సమయంలో యంత్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.



భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

జూలపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన సుమలత(31) అనే వివాహిత ఐదు రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్తసురేష్ సోమవారం జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమలత తో సురేష్‌కు 9 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వారి మధ్య ఏర్పడిన మనస్పర్ధలతో ఈనెల 25నఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందని సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, సుమలత ఆచూకీ తెలిస్తే 8712658670, 8712656513 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శంకరపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8400 నగదు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

పెద్దపల్లిలో పట్టపగలు దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?


పోలం కుమార్ (ఫైల్)


హత్య అనంతరం అక్కడే కూర్చున్న సంతోష్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం పట్టపగలే దారుణ హత్య జరిగింది. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికిచెందిన వేల్పుల సంతోష్ కుమార్.. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికిచెందిన పోలం కుమార్(35)కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడు. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఒకసారి మాట్లాడుకుందామని పోలం కుమార్‌ను సంతోష్‌కుమార్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రమ్మన్నాడు. సంతోష్ కుమార్ భార్యతో కలిసి మార్కెట్‌యార్డ్‌కు వచ్చాడు. అనంతరం వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకొంది.

ఈ క్రమంలో సంతోష్‌కుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో పోలంకుమార్‌పై కిరాతంగా దాడిచేశాడు. చనిపోయి తరువాత కూడా మర్మాంగాలపై కాలితో నొక్కి కసి తీర్చుకున్నాడు. దీంతో పోలం కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సంతోష్‌కుమార్ మృతదేహం ఘటనస్థలం వద్దనే కూర్చొని నీరు తాగుతూ సేదతీరాడు. సంఘటనను చూసిన సంతోష్‌కుమార్ భార్య సొమ్మసిల్లి పడిపోయింది. విషయంతెలుసుకొన్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఆమెను ఆస్పత్రికి, సంతోష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటన జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న వారు ఫొటోలు, వీడియోలు తీశారే కానీ ఎవరూ అడ్డుకోలేదు. ఈ ఘటనపై డీసీపీ కరుణాకర్ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా హత్యకు గురైన కుమార్ భార్య అనిత తన భర్తను సంతోష్, అతడి భార్య శైలజ పథకం ప్రకారమే హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాభర్తని వ్యవసాయ మార్కెట్‌కు రమ్మని ఫోన్‌చేసి చెప్పడంతో కారులో అక్కడికి వెళ్లాడని ఈ క్రమంలో కత్తితో పొడిచి చంపారని పేర్కొంది.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

సైదాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామంలో సోమవారం ఆటోబోల్తాపడి ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండల రేగొండ గ్రామానికి చెందిన మైలారం శారద, చెంచల వనజ, బరిగెల శారద, రెంటాల స్వరూప, కల్వల లలిత, కనక మమత, గాదెపాక సౌమ్య, రెంటాల వెన్నెల రేకొండ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమారం గ్రామసమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి స్వల్పగాయాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లో సోమవారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రోడ్‌లోని వెంకటసాయి గార్డెన్ సమీపంలో రహదారిపై వస్తున్న కారును తప్పించబోయిన మరోకారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

బోల్తాపడిన సున్నపు లోడ్ లారీ

మానకొండూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో సోమవారం సున్నపులోడ్ లారీ బోల్తాపడింది. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న సున్నపులోడ్ లారీ గట్టుదుద్దెనపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

కమాన్‌పూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కమాన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కమాన్‌పూర్ మండలం గుండారం శివారులోని రాజేందర్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉండగా పక్కా సమాచారంతో ఎస్ఐ కొట్టే ప్రసాద్ దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు మండల కేంద్రానికి చెందిన నవలం మల్లేష్, జగిత్యాల జిల్లా గుడిసెలపేటకు చెందిన అలక సందీప్, మద్దెల హరీష్‌లను అరెస్టుచేసినట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎవరైనా గంజాయి సాగుచేసిన, తరలించిన, విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూటౌన్‌సీఐ నక్క ప్రసాద్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

● ప్రతీ రోజు కొడుకుపై దాడి

● గొడ్డును బాదినట్లు బాదుతుండడంతో భరించని ఇరుగుపొరుగు

● రహస్యంగా వీడియో తీసి సఖి అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు

● సఖి సెంటర్‌కు తల్లీకొడుకుల తరలింపు ● జగిత్యాల తులసీనగర్‌లో ఘటన


జగిత్యాల సఖి కేంద్రంలో అధికారుల వద్ద ఉన్న బాలుడు

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా ఓ కన్నతల్లి కర్కశత్వం ప్రదర్శించింది. కొడుకును తల్లే నిత్యం గొడ్డును బాదినట్లు బాదుతోంది.. మూడు సంవత్సరాలు నిండని పసిబిడ్డపై పైశాచికత్వం ప్రదర్శిస్తోంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీ నగర్‌లో సోమవారం తల్లి దాష్టికాన్ని భరించలేని ఇరుగుపొరుగు వారు రహస్యంగా సంఘటనను వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లీ కొడుకులను సఖి సెంటర్‌కు అధికారులు తరలించారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆంజనేయులు అనే వ్యక్తికి రమ అనే మహిళతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆంజనేయులుకు గతంలో వివాహ జరిగినప్పటికీ మనస్పర్థల కారణంగా భార్యభర్తలు విడిపోయారు. ఈ విషయం వివరించి రమను నాలుగు సంవత్సరాల క్రితం ఆంజనేయులు రెండో వివాహం చేసుకున్నాడు. వీరిరువురు కొద్దికాలం కాపురం చేశారు. రమ ఆరునెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఉపాధి నిమిత్తం ఆంజనేయులు దుబాయికి వెళ్లాడు. రమ తులసీనగర్‌లోని తమ ఇంట్లో కొడుకుతో నివాసం ఉంటోంది. కాగా దుబాయిలో ఉన్న ఆంజనేయులుకు జగిత్యాలలో ఉన్న రమకు మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. ఇంకో మహిళతో ఆంజనేయులు దుబాయి నుంచి తరచుగా ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు రమకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇంట్లో బాబు తరుచూ అల్లరి చేస్తుండడంతో చికాకు, మానసిక ఒత్తిడికి గురవుతున్న రమ ఇటీవల తరచూ బాబును కొడుతోంది. గతంలోనూ కొడుకును కిందపడేసి తొక్కుతుండడం, కొట్టడంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో పోలీసులు రమకు కౌన్సెలింగ్ ఇచ్చారని స్థానికులు అంటున్నారు. అయినప్పటికీ రమ పరిస్థితిలో మార్పురాలేదని మళ్లీ పసిబాబును బాదుతుండడం గమనించిన కాలనీవాసులు రహస్యంగా వీడియో తీసి అధికారులకు, సఖి సెంటర్ నిర్వాహకులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీశ్, సఖీ సెంటర్ అడ్మిన్ లావణ్య, ఇతర అధికారులు హుటాహుటిన తులసీనగర్‌లోని రమ నివాసానికి వెళ్లి రమను, బాబును సఖీ సెంటర్‌కు తరలించారు. రమకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇదిలాఉండగా పోలీసులు సైతం సంఘటనపై విచారణ జరుపుతున్నారు. కాగా బాబును కొట్టిన సంఘటనపై తన తప్పును తెలుసుకున్నానని, ఇక ముందు అలా చేయనని, మరోమారు చేసినట్లయితే కఠినచర్యలు తీసుకోవాలని సఖీ సెంటర్ అధికా రులతో రమ వేడుకుంది. రమకు మానసిక ఆరోగ్యం సరిగా లేదని కాలనీవాసులు అంటున్నారు. కాగా సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా కేసు నమోదు చేయడంతో పాటు సమగ్ర విచారణ చేపడతామని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

లారీ-ద్విచక్ర వాహనం ఢీ

● యువకుడు మృతి, మరొకరికి గాయాలు


నరేశ్(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం దర్గా సమీపంలో సోమవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొని నరేశ్(18) అనేయువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండలం రాంపూర్‌కుచెందిన బోదాసు రాజుకుమార్, అల్లెపు నరేశ్‌లు ద్విచక్ర వాహనంపై జగిత్యాల వైపు నుంచి వస్తుండగా రాజారం దర్గా సమీపంలో లారీవెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికితీవ్రగాయాలు కాగా పోలీసులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా నరేశ్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. నరేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్ శిక్షణకు వెళ్లి వస్తున్నక్రమంలో ప్రమాదం జరిగింది. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి


లస్మవ్వ(ఫైల్)

మెట్‌పల్లిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిరూరల్ మండలం జగ్గసాగర్ గ్రామశివారులోని వడ్డెరకాలనీకి చెందిన దుండుగుల లస్మవ్వ(44) భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ సోమవారం ప్రమాదవశాత్తు జారిపడిమృతిచెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. లస్మవ్వ భర్తతోకలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త దండుగులనర్సయ్య ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బసంత్‌నగర్ గ్రామానికి చెందిన దేవిశేఖర్(43) అనే లారీడ్రైవర్ వడదెబ్బతో సోమవారం మృతిచెందాడు. శేఖర్‌సిమెంటులోడుతో శనివారం వైజాగ్ వెళ్లాడు. ఆదివారం తిరుగుప్రయాణంలో వాంతులు, విరేచనాలు కావడంతో క్లీనర్ సహాయంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులుతెలిపారు. మృతదేహన్ని వైజాగ్‌నుంచి బసంత్‌నగర్‌కు సోమవారం తీసుకు వచ్చారు. కాగా మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

● వరుస దొంగతనాలతో బెంబేలు ● తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

● పనిచేయని నిఘానేత్రాలు



గంభీరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఇటీవల వరుసదొంగతనాలు జరుగుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఊర్లకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. నాగంపేటలో శనివారం రాత్రి దొంగలు తాళాలు వేసిన 10 ఇళ్లలో బీభత్సం సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10ఇళ్లలో దొంగతనానికి పాల్పడటంతో స్థానికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏదో ఒకగ్రామంలో ఒకటిరెండు ఇళ్లకే పరిమితమైన దొంగతనాలు పది ఇళ్లకు విస్తరించడంతో వామ్మో ఇవేమి దొంగతనాలు అంటూ ప్రజలు వనికిపోతున్నారు. ఈ మధ్యనే కోళ్లమద్దిలో కూడా రెండు తాళాలు వేసిన రెండుఇళ్లలో దొంగలు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కోళ్లమద్దిలో దొంగతనం జరిగి, వారం కూడా గడవక ముందే నాగంపేటలో దొంగలు ఏకంగా10 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

పోలీస్ పెట్రోలింగ్ తిరుగుతున్నా..

గంభీరావుపేట మండలంలో ఓ వైపు పోలీస్‌లు రాత్రివేళల్లో పెట్రోలింగ్ తిరుగుతున్నా దొంగతనాలు ఆగడం లేదు. రాత్రి సమయాల్లో పోలీస్‌లు గ్రామాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ తిరుగుతున్నారు. అయినా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీస్‌లకు సవాల్‌గా మారిన ఈ వరుస చోరీలను నివారించాల్సిన అవసరం ఉంది. దొంగలు ఈ ప్రాంతానికి చెందిన వారా.. లేక ఇతర ప్రాంతాలకు చెందిన దొంగల మూఠా సభ్యులా అనేది అంతుచిక్కడం లేదు.

పనిచేయని నిఘా నేత్రాలు

గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలా వరకు పనిచేయడం లేదు. పలు సంఘటనలను నివారించేందుకు దోహదపడే నిఘానేత్రాలు పనిచేయకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రధాన కూడళ్లలో అప్పట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నాగంపేటలో ఒక్క గ్రామ పంచాయతీ ముందు ఉన్న సీసీ కెమెరా మాత్రమే పనిచేయగా, మిగితా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామంలోని అన్ని సీసీకెమెరాలు పనిచేస్తే దొంగతనాలపై ఏదైనా క్లూ దొరికి ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కొత్తపల్లి శివారులోని గుంపుల శ్రీనివాస్‌కు చెందిన మామిడితోటలో సోమవారం ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బసంత్‌నగర్ ఎస్ఐ తెలిపిన వివరాలమేరకు మంథని మండలం లక్కెపురం గ్రామానికి చెందిన పండుగు మొగిళి(45) ఇటీవల ఓ మహిళ హత్య కేసులో నిందుతుడిగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసుకు భయపడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని మృతుడికుమారుడు అభిషేక్ ఇచ్చినఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

● ఎనిమిది మంది అరెస్ట్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)! జగిత్యాల జిల్లాలో సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసి ఎనిమిదిమంది పేకాటరాయు ళ్లను అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాయికల్ మండలం షైతాపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై, జగిత్యాల పట్టణంలోని భవాని నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రెండు ఘటనల్లో ఎనిమిదిమంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17,875 రూపాయల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, రమేష్, అఫ్రోజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

● అర్ధాంతరంగా వెళ్లిపోయిన బీహార్ హమాలీలు


భూషణరావుపేటలో కొనుగోళ్లకు నోచుకోని ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో ఐదురోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. బీహార్‌కు చెందిన హమాలీలు ఐదు రోజులు తూకం వేయగా నిర్వాహకులకు ఎలాంటి సమాచారం లేకుండా గురువారం వెళ్లిపోవడంతో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి ముద్దయి పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏపీఎం నరహరిని వివరణ కోరగా హమాలీ అర్ధాంతరంగా వెళ్ళిపోవడంతో కొనుగోళ్లు సాగడం లేదన్నారు. హమాలీల కోసం సమాచారం సేకరిస్తున్నామని మంగళవారం వరకు కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విజయరమణారావు

డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు...

గోదావరిఖని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అభివృద్ధి పనుల కోసం అవసరమైన డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల చేయాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్యశిబిరాలు, విద్య సౌకర్యాలు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు అత్యంత కీలకమని, ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోందని, వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధుల విడుదల జరుగుతుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు.

రైతులకు వరం.. ఉపాధి హామీ పథకం

- చిన్న, సన్నకారు రైతులకు మేలు
- మౌలిక వసతులు, నీటి సంరక్షణ, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చొప్పదండి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపాధి హామీ పథకం వరంలా మారింది. పారిశుధ్యం, నీటి సంరక్షణ, హరితహారం, చెక్‌డ్యాం, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితో పాటు రైతులకు పశువుల పాకలు, గొర్రెల పాకలను ఇటీవల మంజూరు చేయగా నిర్మాణాలను చేపట్టారు. సన్న, చిన్నకారు రైతులకు పందిరి కూరగాయల సాగు, చేపపిల్లల పెంపకానికి కుంటలను ఏర్పాటు చేయడం, పొలం గట్లపై మొక్కల పెంపకం, ఫాంపాండ్‌లను నిర్మిస్తున్నారు. రైతుల కోసం ఉపాధిహామీ పథకంలో ఉన్న కొన్ని పథకాల వివరాలు...

● బీడు భూముల అభివృద్ధి పథకం...

బీడు భూముల్లో బండరాళ్ల తొలగింపు, మీటరు లోతు సరిహద్దు కందకం తవ్వుతారు. రాతి కట్టలు, భూమిని చదు ను చేసి పూడిక మట్టిని రైతుల పొలాలకు తరలింపు, చిన్న ఊటకుంటల నిర్మాణం చేపడుతారు.

● మెట్ట భూముల అభివృద్ధి...

మెట్ట భూముల్లో గుళకరాళ్ల కట్టలు నిర్మిస్తారు. ఫాం పాండ్‌ల నిర్మాణం, బావుల్లో పూడిక తీస్తారు. నాడెపు కం పోస్టు, ఎరువు గుంత, సేద్యపు బావుల తవ్వకం చేపడతారు.

● పందిరి కూరగాయల పెంపకం...

చిన్న, సన్నకారు రైతుల భూముల్లో కూరగాయల పెంపకం చేపట్టి సుస్థిర ఆదాయం కల్పించేందుకు పందిరి కూరగాయల పెంపకం కోసం సబ్సిడీ అందజేస్తారు.



ఫాం పాండ్ తవ్వుతున్న కూలీలు(ఫైల్)

● పండ్ల తోటల పెంపకం...

సన్న,చిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుంది. ఈ పథకం కింద మామిడి, సీతాఫలం, మునగ, జామ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, సపోట, బత్తాయి, అల్లనేరేడు మొక్కలను అందజేస్తారు.

● పశువుల పాక నిర్మాణానికి వంద శాతం సబ్సిడీ..

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పశువులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల షెడ్ల నిర్మాణాలకు యూనిట్లను మంజూరు చేస్తున్నారు. పశువుల పాక నిర్మాణం కోసం 85,340, గొర్రెలు, మేకల పాకకు 92,000, నాటు కోళ్ల షెడుకు 38,344, అజోల్లా పెంపకం కోసం ట్యాంకుల నిర్మాణానికి 6499 రూపాయలను రైతులకు అందజేస్తారు.

● జల సంరక్షణ...

జల సంరక్షణలో భాగంగా రైతులు తమ పొలంలో ఫాం పాండ్స్ నిర్మించుకోవచ్చు. నీటిని నిల్వ చేసుకునే అవసరానికి తగ్గట్టుగా వినియోగించుకోవచ్చు. ఊటకుంట, నీటి నిల్వ కందకాలు, ఫీడర్ కాల్వలు, పంట కాల్వల నిర్మాణం, పశువుల నీటి తొట్టి, చేప పిల్లల పెంపకం కుంటం, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడతారు.



ఫాం పాండ్



పశువుల పాక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో ఆదివారం రాత్రి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేస్తానన్నారు, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్లో మరింత నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కేటాయింపులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి జగిత్యాలకు విచ్చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తపస్ జిల్లా శాఖ పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు, ఇతర హోదాల బాధ్యు లు గడ్డం మహిపాల్‌రెడ్డి, మేన్నేని నీలిమ, చెరకు మహేశ్వర శర్మ, భాగ్యలక్ష్మీతో పాటు మండల బాధ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్నపై కొందరు దౌర్జన్యం చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటివాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు తని ఖీలు చేస్తున్నారని తెలిపారు. తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌ఓకు సహకరించకుండా ఆమెపైన దౌర్జన్యానికి దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడమే తమ విధి నిర్వహణ అని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. బెదిరింపులు, దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల అందజేత



ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ కరీంనగర్ యూనిట్ స్థాయి ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు రిఫ్రిజిరేటర్, ఎల్‌ఈడీ టీవీని సోమవారం అందజేశారు. 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ డ్రా మార్చి 24న నిర్వహించారు. కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ బహుమతి విజేత పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు రిఫ్రిజిరేటర్‌ను అందుకున్నారు. తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీని కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్ అందుకున్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నగునూరి శేఖర్, ఎడిషన్ ఇన్‌చార్జి జయంత్‌రావు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు పాల్గొన్నారు.



తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీ అందుకుంటున్న కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవో శ్రావణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని టౌన్ సీఐ వీరప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. వీరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయంలో జగ ద్గురు శంకరాచార్యులు జయంతి సోమవారం అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 28 నుంచి మే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయ పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీ..: రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో ఏఈవో శ్రావణ్ కుమార్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యాధునిక పద్ధతుల్లో నిత్యాన్నదాన సత్రం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో నిర్మించే నిత్యాన్నదాన సత్రాన్ని ఆధునిక పద్ధతుల్లో నిర్మిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పర్యటనలో భాగంగా సోమవారం కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని నిత్యన్నదాన సత్రాన్ని, క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈవో వినోద్‌రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, అర్చకులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 30 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీహన్సి ఎంపికైంది. హైదరాబాద్‌లో గత ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-11 ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీహన్సి 1500 మీటర్ల రింక్, రోడ్ రేస్ విభాగా ల్లో రెండు బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైందని జిల్లా పాఠశా లల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బిర్లా పాఠశాలకు చెందిన శ్రీహన్సిని సోమవారం డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరి యల్ అధికారి అశోక్‌రెడ్డి, మిలుకూరి శ్రీనివాస్ శిక్షకుడు హరి అభినందించారు.




శ్రీహన్సిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

అరచెయ్యే.. ఆటస్థలం..

- చిన్నారులు, యువతలో సెల్ గేమ్స్ క్రేజ్..
- మితిమీరితే కష్టమే

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు అర చేయి ఆట స్థలం అయింది.. ఆటగాళ్లు ఎందరున్నా, నియమాలు ఎలా ఉన్నా.. సెల్‌ఫోన్ స్టేడియంలో చిన్నారులు, కొత్తతరం కుర్రకారు, యువత ఒంటి చేత్తో ఆటలాడుతున్నారు. మొబైల్ గేమిం గ్ ధోరణి యువత జీవన శైలిలో ఓ భాగమైంది. అర చేతిలో ఇమిడే సెల్‌ఫోన్ ఇప్పుడు సరికొత్త కాలక్షేపంగా అలరిస్తోంది. మొదట్లో సెల్‌ఫోన్ కొనగానే అందులో కొన్ని గేమ్స్ మాత్రమే ఉండేవి. వాటిని ఆడుతూనే ఎంతో ఆనందించేవారు. చిన్నపాటి గేమ్స్‌కు ఉన్న ఆదరణను చూసే ప్రత్యేకంగా త్రీడి, జావా గేమ్స్‌ను తయారు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి. వింత లోకంలోకి లాక్కెళ్లే సెల్‌ఫోన్ గేమ్స్ ఎంతో ఆదరణ పొందుతూ ఓ కొత్త ధోరణికి మార్గం ఏర్పరిచాయి. గేమ్స్‌లో సరికొత్త ట్రెండ్స్ కూడా వేగంగా దూసుకొస్తున్నాయి.



● **వేగంగా వ్యాప్తి..:** కొత్త మొబైల్ గేమ్ మార్కెట్‌లోకి వస్తే చాలు.. చిన్నారులు, విద్యార్థులు, యువత యువకుల్లో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. గేమ్స్‌కు అలవాటు పడుతున్న వారంతా బ్యం దాలుగా మారిపోతున్నారు. పాఠశాలలు, కళాశాలల కూడళ్లలో సమయం దొరికినప్పుడల్లా వీటి గురించే చర్చలు నడుస్తున్నాయి. సరదాలు, షికార్లకు కొదవలేని సమయం కావడంతో వారు కొత్త దనం కోసం అర్రులుచాస్తున్నారు. ఎప్పటికప్పుడూ అంది వచ్చే సరికొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్ సంస్థలు. ఇంటర్‌నెట్‌లో గేమింగ్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుంట్ను వాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

● **గేమ్స్‌తో జాగ్రత్త.. :** మొబైల్ గేమింగ్‌తో కాలక్షేపం మాట అటుంచితే.. ఇదొక వ్యసనంగా మారుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశలో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

ఇన్నాళ్లూ కంప్యూటర్ గేమ్స్‌తోనే సరిపెట్టుకునే వారంతా మొబైల్ గేమ్స్‌కు మారిపోతున్నారు. ఎందుకంటే సెల్‌ఫోన్ ఎక్కడికైనా తీసుకెళ్లే వెసులుబాటు ఉండడటంతో ఈ పరిస్థితి వచ్చింది. మొబైల్ గేమింగ్ వల్ల మానసిక ఆలసట, చదువు మీద ఏకాగ్రత లోపించడం వంటి దుష్ప్రభావాలు కూడా కలుగుతున్నాయి. వ్యసన పరులుగా మారితే మాత్రం ఎన్నో ప్రతికూల ప్రభావాలను చవి చూడాల్సి వస్తుంది. విద్యార్థులు సెల్‌ఫోన్ ఆటలతో శారీర కంగా, మానసికంగా బలహీనులవుతున్నారు. ఆలోచన శక్తి సన్నగిల్లుతుంది. విద్యలో వెనుకబడుతారు. సెల్‌ఫోన్ గేమ్స్‌తో విద్యార్థులు ఇతర పనులపై ఆసక్తి చూపకుండా పోయే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి



పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య పేర్కొన్నారు. ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన డీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా కమిషన్ కలిసి ఒక నిర్ణయానికి వస్తున్నారని, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను మూసివేయడంలో భాగంగా మండలానికి ఆరుప్రాథమిక పాఠశాలలను మూడు ఉన్నత పాఠశాలలను మాత్రమే ఉంచాలనే సంకల్పంతో చర్చలు జరగుతున్నాయని, అలా చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే పాఠశాలలను సెమిరెసిడెన్షియల్‌గా తీర్చిదిద్దాలని, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంకాలం టిఫిన్ అందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంటుందన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు, పెన్షన్, మెడికల్ బిల్స్ జాప్యం చేయకుండా బడ్జెట్‌ను వెంటనే అందించాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సభ్యులు కిషన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్ స్వర్ణకారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్‌కు చెందిన స్వర్ణకారులు పూర్ణాచారి, రవీంద్రాచారి ఎంపికయ్యారు. బిహార్‌లోని బుద్ధగయలో ఆదివారం అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షుడు యశ్పాల్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి ప్రతిపాదించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కందు కూరి పూర్ణాచారిని జాయింట్ సెక్రటరీగా, శ్రీరామోజు రవీంద్రాచారిని జాతీయ ఈసీ మెంబర్‌గా ప్రకటించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు.



పూర్ణాచారి, రవీంద్రాచారికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

● న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలో మరమ్మతుల్లో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు, ఏడీఈ లావణ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు కెమిస్ట్రీ భవన్ ఏరియా, శివటాకీస్, సెయింట్ ఆల్ఫోన్స్, వేంకటేశ్వర దేవాలయం, ఉదయం 8:30 నుంచి 10 వరకు శక్తి ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్‌నగర్, భాగ్యనగర్, జ్యోతి నగర్, గీతాభవన్ వెనుక వైపు ఏరియా, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాత హనుమాన్ దేవాలయం, కొత్త లేబర్ అడ్డా, సాయిబాబా దేవాలయం, విద్యానగర్, విజయదుర్గా కాలనీ, హిందూపురి కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, చైతన్యపురి ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పాత వస్తువుల వేలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లోని వివిధ విభాగాల చెందిన ఉపయోగించిన, పాత వవస్తువులకు సోమవారం కరీంనగర్ సిటీ ట్రైనింగ్ సెంటర్‌లో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా 4,41,400 రూపాయల ఆదాయం సమకూరినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం జమ చేస్తామని వెల్లడించారు.

కొత్త ఫీడర్ ఏర్పాటు

కరీంనగర్ రూరల్/గణేష్‌నగర్: ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని మొగ్దుంపూర్ సెక్షన్‌లో ఇప్పటి వరకు ఉన్న ఫీడర్‌ను వేరు చేసి కొత్తగా 11కేవీ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు, డివిజనల్ ఇంజనీర్ రాజం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏడీఈ రఘు, ఏఈ నరేష్, ప్రొటెక్షన్ ఏఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తకు అవార్డు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త గాలిపెల్లి కుమార్ జాతీయ అవార్డు అందుకున్నారు. వెలుగు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా కుమార్‌ను ఎంపిక చేశారు. ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు.

పుస్తెమట్టెల పంపిణీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బోయవాడకు చెందిన యువతి రవళికి వివాహానికి 'మేముసైతం యువసేన', ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న ఆధ్వర్యంలో సోమవారం పుస్తె మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చకిలం శ్రీనివాస్, రమాదేవి, లక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి



కరీంనగర్‌లో ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



చొప్పదండిలో..

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ, అంబేద్కర్ ప్రాధాన్యం తగ్గించే విధంగా బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ముగింపు సందర్భంగా నగరంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటం చేసి ప్రజలకు సమాన హక్కులు కల్పించి రాజ్యాంగాన్ని అందించిన మహానుభావులని కొనియాడారు. పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, రుద్ర సంతోష్, వెలిచాల రాజేందర్‌రావు, కటుకం మృత్యుంజయం, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, తాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రవణ్‌నాయక్, మాజీ కార్పొరేటర్లు, సిటీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను నిర్వహించారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపకంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఫార్మసీ ఆఫీసర్లు



స్వీట్ తినిపిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టులను తెలంగాణ ప్రభుత్వం ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుక మురళీధర్ నేతృత్వంలో ఫార్మసిస్టు ఆఫీసర్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఫార్మసీ ఆఫీసర్లుగా సముచిత గౌరవాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో బ్లాక్ బెల్ట్ 3వ డాన్ సాధించిన రాజయ్య

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మానుపాటి రాజయ్య కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ బ్లాక్ బెల్ట్ విభాగంలో థర్డ్ డాన్ ఏ గ్రేడ్ సాధించారు. ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఇండియన్ గ్రాండ్ మాస్టర్ సీహెచ్ మధునయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటారు.

ఎన్ఎస్ఎస్ జాతీయ సమావేశంలో వివేకానంద ప్రోగ్రాం అధికారి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ జాతీయ యువజన క్రీడా సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ జాతీయ సమావేశానికి జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అభినందించారు. కరస్పాండెంట్ ఆగమరావు, ఏసీవో సంపత్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల భూమిని ఇతర అవసరాలకు ఇవ్వబోం

భగత్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని ప్రభుత్వ పాఠశాల భూమిని ఇతర అవసరాలకు ఇచ్చేది లేదని రేకుర్తి వాసులు ఉమ్మడిగా తీర్మానించారు. సోమవారం రేకుర్తి పాఠశాల అవరణలో కాలనీ వాసులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రేకుర్తి 18వ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కొంతభాగం కావాలని ఎన్జీవోలు అధికారుల వద్ద ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, దుర్గం కొమురయ్య పాల్గొన్నారు.

బాధిత మహిళలకు సత్వర సేవలు

కరీంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, సఖి కేంద్రాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలకు సత్వరమే సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు. సోమవారం సఖి కేంద్రంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, శక్తి సదన్, సఖి కో-ఆర్డినేటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించినప్పుడు వారికి ఉచిత న్యాయం, వైద్యం, ఆశ్రయంతోపాటు పోలీసు సేవలను సత్వరమే అందించాలన్నారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పదిమంది కంటే ఎక్కువ మహిళలు పనిచేస్తున్న ప్రైవేట్, ప్రభుత్వ పని ప్రదేశాల్లో ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు స్వీయ అభివృద్ధి పథకాలు, ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సఖి అడ్మిన్ లక్ష్మి, డీహెచ్ఈడబ్ల్యూ కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

బజాజ్ గోగో ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కరణ



వాహనాన్ని ఆవిష్కరిస్తున్న బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ బాబ్జి నెల్లి, రీజినల్ సర్వీస్ మేనేజర్ కృష్ణదత్త కుబేర్

భగత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హరిహర బజాజ్ అధునాతన షోరూంలో సోమవారం బజాజ్ ఆటో నూతన ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ఆటో గోగోను బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ బాబ్జి నెల్లి, రీజినల్ సర్వీస్ మేనేజర్ కృష్ణదత్త కుబేర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో గోగో కాలుష్యాన్ని తగ్గించేలా టెక్నాలజీతో తయారు చేశారని, ప్యాసింజర్, కార్గో వాహనాలకు ఒకే చార్జింగ్‌తో 250 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయవచ్చని అన్నారు. ఈ కార్యాక్రమంలో షో రూం అధినేత నరెడ్ల అనిల్‌కుమార్, మేనేజర్ నాగరాజు, కంపెనీ ఏరియా మేనేజర్ వంశీకృష్ణ, అభిషేక్, ఆటోయూనియన్ ప్రెసిడెంట్‌లు, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభతో ఉలిక్కిపడిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను చూసి ప్రభుత్వం ఉలిక్కిపాటుకు గురైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రాంతీయ పార్టీగా ప్రతిపక్షంలో ఉండి లక్ష మందితో రజతోత్సవ సభ నిర్వహించిన ఘనత దేశ చరిత్రలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి ఆర్‌టీఏ ద్వారా మెసేజ్‌లు పంపి సభకు బస్సులు పంపకుండా ప్రభుత్వం అడ్డుకుందని, యాజమాన్యాలు ప్రభుత్వానికి భయపడకుండా బస్సులు పంపాయని అన్నారు. హామీలపై మంత్రులకు గ్రామాల్లో సభలు పెట్టే దమ్ముందా? అన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు హరిశంకర్, కరీంనగర్ ప్యాక్స్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పహల్గాం మృతులకు బీసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని విద్యారణ్యపురి కాలనీవాసులు సోమవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అల్సా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోరేపు లక్ష్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు దారబోయిన నరసింహ యాదవ్, గౌరవ అధ్యక్షుడు బ్యాలెంగల హనుమయ్య, భద్రపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం నగరంలోని కళాభారతిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగింది. కమిషనర్ హాజరై దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కోసం నగర వ్యాప్తంగా దాదాపు 15వేల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వచ్చిన దరఖాస్తులకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారీగా నగరపాలక సంస్థ కళాభారతిలో పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆన్‌లైన్ చేసుకున్న దరఖాస్తుదారులు, ఆన్‌లైన్ కాపీతో మ్యానువల్ దరఖాస్తులను నగరపాలక సంస్థలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరమాత్మ తత్వాన్ని అర్థం చేసుకోవాలి



పాల్గొన్న మాధవానంద సరస్వతిస్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరమాత్మ తత్వాన్ని ప్రతీ భక్తుడు అర్థం చేసుకోవాలని రంగంపేట గురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి అన్నారు. అఖిల బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ శాఖ సౌజన్యంతో గాయత్రీనగర్ గణేశ శారదా శంకరాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అవలంబించాలన్నారు. ఉదయం రుద్ర, శ్రీసూక్త, శ్రీమాత్రే నమః పారాయణాలు, లక్ష పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం రుక్మాభట్ల నృసింహశర్మకు సన్మానం చేశారు. కస్పా భూమేశ్వరరావు, ఉపేంద్రశర్మ, రామక విఠలశర్మ, ప్రేంచందర్ రావు, వామనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనిపించని యూనివర్శిటీల సమస్యలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాల్లోని సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదని ఎస్‌యూ కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు అన్నారు. యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్దీకరించాలని ఎస్‌యూ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంతకుముందు రెగ్యులర్ అధ్యాపకులు, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ సంచాలకులు, వ్యాపార వాణిజ్య కళాశాల నుంచి ఎంబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు సంఘీభావం తెలిపారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



చల్లూరు పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో వెంకటరమణ

వీణవంక/శంకరపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలోని చల్లూరు, వీణవంక, శంకరపట్నం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల్లోని హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. ఆరోగ్యం కేంద్రంలోని లేబర్‌రూంలను సందర్శించి సాధారణ ప్రసవాలు పెంచాలని సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్‌రూమ్, ల్యాబ్, డెలివరీరూమ్‌లను పరిశీలించారు. 'ఆరోగ్యమహిళా' హెల్త్‌క్యాంపులు నిర్వహించి మహిళలకుస్క్రీనింగ్ పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వైద్యాధికారులు వరుణ, సుచిత్ర, సంధ్య, పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే 10రోజులైనా డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరికోసిన హార్వేస్టర్ యజమానులు, హమాలీలు, ట్రాక్టర్ యజమానులు డబ్బులకోసం ఇంటి చుట్టూ తిరుగుతున్నారని రైతులు వాపోతున్నారు. సాధారణంగా ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత సంబంధిత రైతులకు 48గంటల్లో నగదు వారిఖాతాల్లో జమచేస్తారు. ఈసారిధాన్యం కొనుగోళ్లు చేసి పదిరోజులు గడుస్తున్నా జమకాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులధాన్యం డబ్బులను వారిఖాతాల్లో వేయాలని కోరుతున్నారు.

సీపీఐ మండల మహాసభ

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి గ్రామంలో సోమవారం భారత కమ్యూనిస్టుపార్టీ సీపీఐ 13వ మండల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల్లో శాఖలు ఏర్పాటుచేసుకొని కార్యదర్శులను ఎన్నుకుంటూ కమిటీలు వేశామని తెలిపారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శిగా బోయిని తిరుపతి, సహాయ కార్యదర్శిగా సూరం మల్లేశం, కోశాధికారిగా పార్నంది రాజకుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

సైదాపూర్: రానున్న రోజుల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడం కోసం గ్రామ గ్రామాన మహాసభలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు అన్నారు. సోమవారం మండలంలోని అమ్మనగుర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో గ్రామశాఖమహాసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 10న సీపీఐ మండల మహాసభ నిర్వహిస్తామన్నారు. జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గుండ్లపల్లి గ్రామశాఖ కార్యదర్శిగా కొమ్ములరాజు, సహాయకార్యదర్శిగా ముష్కె కమలాకర్, అమ్మనగుర్తి గ్రామశాఖకార్యదర్శిగా భాషవేణిరాజు, సహాయకార్యదర్శిగా ముష్కెరాజు, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

రూ.7500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7500పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ముగ్గురురైతులు 45క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కాసులిస్తేనే ఇంటి నిర్మాణ అనుమతులు

● జమ్మికుంట మున్సిపాల్టీలో ఓ అధికారి తీరు



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలో ఇంటి నిర్మాణంకోసం అనుమతులు కావాలంటే అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే సరిపోదు. అడిగినంత కాసులు ముట్టచెప్తేనే పని అవుతుంది. పైసా నహీతో.. పర్మిషన్ నహీ.. అనే సుత్రాన్ని ఓ అధికారి పక్కా పాటిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. సదరు అధికారికి రాజకీయ పలుకుబడి, ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మికుంట పట్టణీకరణ రోజురోజుకు విస్తరిస్తోంది. ఇండ్లు, కమర్షియల్ భవననిర్మాణ అనుమతులకోసం ప్రతినెల 25నుంచి30వరకు దరఖాస్తులు వస్తుంటాయి. మున్సిపల్‌పరిధిలో ఆరుగురు లైసెన్స్ ప్లానర్లు ఉన్నారు. వీరిలో సదరు అధికారి ఒకప్లానర్‌ను దగ్గర పెట్టుకున్నట్లు తెలు స్తోంది. ఎవరు పర్మిషన్ కావాలని కార్యాలయానికి వచ్చినా టీఎస్‌బీ పాస్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తాడు. ఎవరి వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలనే విషయంమాత్రం ఆయన వ్యక్తిగత సహచరులు చూసుకుంటారు. కాదని మరోవ్యక్తి దగ్గరఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కార్యాలయం చుట్టూ తిప్పుకొని ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ల తాగిస్తుం టాడు. ఇదేమిటని నిలదీస్తే డాక్యుమెంట్లు సరిగ్గా లేవంటూ కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తాడు. చేసేది ఏంలేక అధికారి అడిగినంత ముట్టచెప్పుకొని అనుమతులు తీసుకుంటారు. సదరుఅధికారిపై పూర్తిస్థాయి విచారణ జరిపితే అనేకమంది తమగోడు వెల్లబోసుకుంటారని భాదితులు పేర్కొంటున్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్‌లోగల భవిత కేంద్రాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారులు అంజనేయులు, కృపరాణి, జిల్లాయువజన కోఆర్డినేటర్ రాంబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై సూచనలు చేశారు. భవితకేంద్రంలోని పిల్లలకు అన్ని విధాలుగా వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్, గన్నేరువరం మండల విద్యాధికారులు శ్రీనివాస్, రామయ్య ఐఈఆర్‌పీలు గణేష్, పద్మ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిన సభ

గంగాధర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం ఆయన గంగాధరలో మాట్లాడారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

గంగాధర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యోగాశిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి తెలిపారు. వచ్చే నెల1 నుంచి 10వరకు ఉచితయోగా సమ్మర్ క్యాంపు మల్లాపూర్ జడ్పీహెచ్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యోగా శిబిరాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న కేసీఆర్



మానకొండూర్‌లో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి కేసీఆర్ ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహించిన రజతోత్సవ సభలో తెలంగాణకు కాంగ్రెసే విలన్ అని కేసీఆర్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, వైస్‌చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులను అభినందించిన ఎమ్మెల్యే..

మానకొండూర్ మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులనుఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. పేద కుటుంబంలోపుట్టి స్టేట్‌లెవల్ మార్కులు సాధించి మండలానికి పేరు ప్రతిష్ఠతలు తీసుకరావడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు.

ముస్లిం పేదలకు న్యాయం చేసేందుకే వక్ఫ్ చట్ట సవరణ

గన్నేరువరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం పెత్తందారి వ్యవస్థ నుంచి పేదముస్లింలకు న్యాయం చేయడానికే కేంద్ర ప్రభు త్వం వక్ఫ్‌చట్ట సవరణను ప్రవేశపెట్టిందని బీజేపీ మండల సీనియర్ నాయకుడు ఏలేటిచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తూ ముస్లింల మెప్పుకోసం పనిచేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు విలాసాగరం రామచంద్రం, మచ్చ బాలరాజు, బండితిరుపతి, అటికం రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులను నిలువు దోపిడీచేస్తున్న విత్తన కంపెనీ యాజమాన్యాలపై వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లా డారు. సీడ్‌వడ్లను పండించిన రైతులకు రూ.3100మద్దతు ధర కల్పించడంతోపాటు 20రోజుల్లోనే ఆ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రావుల భాస్కర్‌రెడ్డి, గూడూరు మల్లారెడ్డి, పోరెడ్డి కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

శంకరపట్నం: మండలకేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మఇళ్లు కేటాయించాలని టీడీపీ అడ్‌హక్‌కమిటీ పార్లమెంట్ సభ్యుడు మోరెప్రభాకర్ సోమవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

-శంకరపట్నం మండలం పీహెచ్‌సీలో సోమవారం వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. కేశవపట్నం గ్రామానికి చెందిన హీనా పురిటినొప్పులతో రాగా ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ మహేశ్వరి, వైద్యసిబ్బంది మహిళకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద సోమవారం రాత్రి ఆర్యవైశ్య, యువజన సంఘం ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనం పాటించారు.

జమ్మికుంట రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమ కేసులు ఎదుర్కొన్నామని కాంగ్రెస్‌పార్టీ పట్టణ మాజీఅధ్యక్షుడు కసుబోజుల వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అప్పటి కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్‌తో కలిసి బీఆర్ఎస్‌పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేశామన్నారు. అందుకే తాము కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు.

గంగాధర: మండలంలోని మల్లాపూర్, గోపా ల్‌రావుపల్లి, నడింపల్లిగ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని గ్రామానికి చెందిన లంక రమాదేవి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది.

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్‌లో ప్రీమియర్ లీగ్ ఫర్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అందజేశారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామమాజీ ఎంపీటీసీ తోటలక్ష్మణ్ తల్లి ఐలమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందింది. మాజీజడ్పీటీసీ డాక్టర్‌శ్రీరామ్‌శ్యామ్ సోమవారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.